క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



టెంకాయ కొడుతున్న ప్రశాంత్‌కుమార్

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పోచమ్మతండా నుంచి మైసమ్మతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌కుమార్ ప్రారంభించారు. రెండు తండాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.1.50 కోట్ల నిధులు మంజూరయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోచమ్మతండా మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, నాయకులు రాజునాయక్, కిషన్‌నాయక్, హనుమనాయక్, సేవ్యానాయక్, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించండి



బంట్వారంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు

బంట్వారం: ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ పరిధిలోని పలు రోడ్డు మార్గాల్లో ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలు వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని ఆయా మార్గాల్లో ఇరువైపులా ముళ్ల పొదలు అనుకొని ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రాత్రి వేళ ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో ద్విచక్ర వాహనదారులకు ముళ్ల పొదలు తగిలి కింద పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేశారు.

‘చలో ఇందిరాపార్కు’కు తరలిన నేతలు



ఇందిరాపార్కుకు బయలుదేరిన పూడూరు మండల వాసులు

పూడూరు: నేవీ రాడార్ నుంచి దామగుండం అటవీ ప్రాంతాన్ని కాపాడాలని కోరుతూ చేపట్టిన చలో ఇందిరాపార్కు కార్యక్రమానికి పూడూరు మండల నాయకులు తరలివెళ్లారు. నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలు, పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరించడంతో పూడూరు మండల నాయకులు ఆందోళన తీవ్రరూపం దాల్చారు. ఈ మేరకు ఆదివారం ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు మండల వాసులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ మేనేజర్‌గా రాజేందర్‌రెడ్డి



కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ మేనేజర్‌గా రాజేందర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన బాల్‌రాజ్ రిటైర్మెంట్ అయ్యారు. దీంతో నియోజకవర్గంలోని పోలేపల్లి శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ ఈఓగా ఉన్న రాజేందర్‌రెడ్డికి కొడంగల్ ఆలయ మేనేజర్‌గా బాధ్యతలను ఎండోమెంట్ అధికారులు అప్పగించారు. ఈ నేపథ్యంలో కొడంగల్ శ్రీవారి ఆలయంలో విధుల్లో చేరారు.

పరిసరాల శుభ్రతకు సహకరించండి

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్‌లో పారిశుద్ధ్య పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆదివారం పంచాయతీ కార్మికులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఉన్న కాలువల నుంచి మురుగును తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల అధికారులు సదర్శించి పరిశుభ్రతపై అహగాహన కల్పించారు. దీంతో కొంత మార్పు మొదలైంది. గ్రామస్తులు ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేయకుండా జాగ్రతలు పడుతున్నారని కార్మికులు చెబుతున్నారు. పారిశుద్ధ్యానికి అందరూ సహకరించాలని కోరారు.

మినుము.. గోడు వినుమా!

- భారీ వర్షాలకు పంట దిగుబడిపై ప్రభావం
- పెట్టుబడులు సైతం రాలేదని రైతుల గగ్గోలు



తట్టెపల్లిలో మినుమును యంత్రంలో వేస్తున్న రైతులు

పెద్దేముల్: ఆరుగాలం శ్రమించిన రైతన్నలకు వరుణుడి ప్రకోపంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పంట పెట్టుబడులు సైతం రాని పరిస్థితి దాపురించింది. మినుము, పెసర పంటలకు గతంలో దిగుబడి ఉన్నా మద్దతు ధర దక్కేది కాదు. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఉన్నా పంటలను వర్షాలు దెబ్బతీయడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. గతేడాది కంటే ప్రస్తుతం జిల్లాలో మినుము, పెసర సాగు అధికంగా చేపట్టినట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా. మండలంలోని ఇందూరు, పెద్దేముల్, తట్టెపల్లి, నర్సాపూర్, జనగాం, నాగులపల్లి, రుద్రారం, మారేపల్లి, హన్మాపూర్, గిర్మాపూర్, జైరాంతండా, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లో మినుము, పెసర పంటలు సుమారు రెండు వేల ఎకరాల్లో సాగుచేశారు. పత్తి 12,500 ఎకరాలు కాగా కందిని పది వేలల్లో సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఇటీవల వరుణుడు ప్రతాపానికి అపార నష్టం వాటిల్లిందని కర్షకులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. సాధారణంగా మినుములు ఎకరాలో సుమారు 4–5 క్వింటాళ్లు, పెసర 3–4 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం ఎకరాకు రెండు క్వింటాళ్లు దిగుబడి రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

మార్కెట్‌లో మంచి ధర

ఏటా ఎరువుల ధరలు, కూలీల పెట్టుబడులు మాత్రం రెండింతలు పెరిగాయని, గతంలో కలుపు తీయడానికి రూ.250 నుంచి రూ.300 కూలీలకు ఇచ్చేదని, ప్రస్తుతం రూ.500లకు పైగా ఇస్తున్నారు. మూడేళ్ల నుంచి అధిక వర్షాలతో పెసర, మినుము పంటలు పాడై చేతికి దక్కడం లేదు. పత్తి, కంది పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని మండల రైతులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మినుము పంటకు ధర రూ.ఆరు వేల నుంచి మొదలై ఏ గ్రేడ్ పంటకు రూ.8 వేలు పలుకుతుంది.



పొలంలో పంటను కుప్పలుగా పెడుతున్న కూలీలు (ఫైల్)

పంటలు లేక తాండూరు, ధారూరు మార్కెట్లు వెళవెళ బోతున్నాయని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి రాలేదు



ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మినుము పంట సాగు చేస్తే నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడికి రూ.1.50 లక్షలు ఖర్చు అయింది. గతంలో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. వరుణుడు కరుణించక తీవ్ర నష్టం వాటిల్లింది. పెట్టుబడి సైతం రాలేదు.

– మహ్మద్ షకీల్, రైతు, పెద్దేముల్

ఖర్చులు అధికం



గతంతో పోలిస్తే ప్రస్తుతం పంట సాగుకు పెట్టుబడులు పెరిగాయి. వర్షాలు లేకుంటే మంచి దిగుబడి వచ్చేది. పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్నా పెట్టుబడులు రెండింతలు అవుతున్నాయి. ఎరువులు, పురుగు మందుల ధరలు మండి పోతున్నాయి. ప్రభుత్వమే నష్ట నివారణ చర్యలు తీసుకోవాలి.

– ప్రకాశ్‌రెడ్డి, రైతు, గాజీపూర్

ప్రభుత్వమే ఆదుకోవాలి



మూడేళ్ల నుంచి వర్షాలతో పంటలు పాడవుతున్నాయి. వ్యవసాయం తప్ప మరొకటి తెలీదు. భారీ వర్షాలకు పంటలు పాడై అప్పుల పాలవుతున్నాం. ఎరువుల ధరలు ఏటా భగ్గు మంటున్నాయి. గతంలో పిచికారీ చేసే మందులను సర్కారు అందుబాటులో ఉంచేది. తమని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– వెంకటేశం, రైతు, జనగాం

సంఘం అభివృద్ధికి కృషి

పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి



మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బంట్వారం రైతు సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లిస్తే వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. రికవరీ 50 శాతం కంటే ఎక్కువగా ఉంటేనే నాబార్డు లాంటి సంస్థలు మరింత ఎక్కువగా అప్పు ఇచ్చేందుకు ముందుకు వస్తాయన్నారు. సంఘం అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని ఆయన సూచించారు. త్వరలోనే ఎరువుల గోడౌన్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలం సేకరణ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. సొసైటీలో తక్కువ వడ్డీకే బంగారం తాకట్టుపై రుణ సదుపాయం ఉందన్నారు. అంతకు ముందు సీఈఓ బ్రహ్మం జమా ఖర్చుల లెక్కలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, సొసైటీ డైరెక్టర్లు రాధాకృష్ణగౌడ్, మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘ఫార్మా’ వ్యతిరేక దీక్ష

దుద్యాల్: ఫార్మాసిటీకి వ్యతిరేకంగా మండల పరిధిలోని హకీంపేట, లగచెర్ల, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచెర్ల తండాలకు చెందిన రైతుల రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం బాధిత రైతులు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ రద్దు చేయకుంటే ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పోరాటాలు చేపట్టేందుకు సిద్ధమన్నారు. దీక్షలో కిషన్ నాయక్, బాబు నాయక్, రాములు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ చైర్మన్‌కు సన్మానం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ నూతన చైర్మన్‌గా గ్రామానికి చెందిన నారం దినేశ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివారం దినేశ్‌రెడ్డిని ఆయన మిత్రబృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో దేవాలయ అభివృద్ధికి మా వంతు సహకారాన్ని అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో నల్లమోని జగన్, రాజ్‌సర్కార్, మఠం రిషికేశ్, రవితేజ, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌కు శుభాకాంక్షలు

షాద్‌నగర్‌రూరల్: పీసీసీ చీఫ్‌గా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పాఠశాలల క్రీడల, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆయన శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహేశ్ కుమార్‌గౌడ్ భవిష్యత్‌లో మరిన్నీ ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్



జెండా ఆవిష్కరణలో సామెల్ తదితరులు

ఇబ్రహీంపట్నం: పేదల పక్షాన నిరంతరం పోరాడేది సీపీఎం పార్టేనని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ 3వ శాఖ మహాసభ స్థానిక వెంకటేశ్వరనగర్ వెంచర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు, కూలీలు, పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎంకు అండగా ఉండాలన్నారు. వార్డుల వారీగా ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ మహాసభలో భవిష్యత్ ప్రణాళిక రూపొందించి ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంకానున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు.

మహాసభ కార్యదర్శిగా దశరథ

అంబేడ్కర్ శాఖ 3వ మహాసభ కార్యదర్శిగా మల్లెల దశరథను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ.. తనకు ఈ పదవినిచ్చిన వారి ఆశలు వమ్ము చేయకుండా పార్టీ అభ్యున్నతికి శాయశక్తుల కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేష్, సభ్యులు ఏర్పుల వీరేశం, యెలమోని స్వప్న, షేఫి ఉన్నిసా, చెనమోని శంకర్, నర్సింహా, సయ్యప్, ప్రదీప్, బంటి, ప్రమోద్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్: బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కక్కులూర్ గ్రామంలో పోలింగ్ బూత్ నెంబర్ 210, 2011లో బూత్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో బీజేపీని అతిపెద్ద రాజకీయ పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, విష్ణు, సురేశ్, నరేశ్, రాము, తదితరులు ఉన్నారు.



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి

భవనం పూర్తయ్యేదెన్నడో?



అసంపూర్తిగా స్త్రీశక్తి భవనం

దౌల్తాబాద్: మహిళా సంఘాలు, ఐకేపీ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వం నిర్మిస్తున్న భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. భవన నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యం కారణంగా మండల కేంద్రంలో నిర్మించిన స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు సగంలోనే ఆగిపోయింది. దీంతో స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనంలో మొదటి అంతస్తు మహిళా సమాఖ్య నిర్వహణ, రెండవ అంతస్తులో ఉపాధి కార్యాలయం నిర్వహించుకునేలా డిజైన్ రూపొందించారు. కాంట్రాక్టర్ పనుల్లో తీవ్ర జాప్యం చూపుతున్నారు. 2012లో శంకుస్థాపన చేయగా 2013లో పూర్తి కావాల్సినప్పటికీ సుమారు 12 ఏళ్లు కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. అయితే ఈ అసంపూర్తి భవనంలోనే ఐకేపీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా భవన పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులను స్థానికులు కోరుతున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ఎంఈఓ హరిశ్చందర్



వంట సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈఓ

పరిగి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకుని విద్యను అందించాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి కావాల్సిన విద్యా నైపుణ్యాలను నేర్పించి మంచి ఫలితాలను రాబట్టేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, ఎలాంటి అవకతవకలు జరిగినా వెంటనే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులను పర్యవేక్షిస్తూ వారికి మంచి విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలు మదిలో పదిలం



కుల్కచర్ల: పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుల్కచర్ల: వాళ్లు పదో తరగతి చదివి ముప్పై ఏళ్లు గడిచింది. అప్పుడు చదివిన స్నేహితులు, గురువులు కలుసుకునేందుకు వారందరూ ముందుకొచ్చారు. ఫలితంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. మండలంలోని పట్టాపహాడ్‌కు చెందిన 1994–95 బ్యాచ్ పదో తరగతి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఆదివారం సమ్మేళనం ఏర్పాటు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, నాటి విద్యాధికారి వెంకటరెడ్డిని ఆహ్వానించి సన్మానించారు. స్నేహితులందరూ తీపి గుర్తులను నెమరేసుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ప్రస్తుత జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయ్..



పెద్దేముల్: మంబాపూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దేముల్: మండల పరిధిలోని మంబాపూర్ ఉన్నత పాఠశాల 2007–08 పదో తరగతి బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు గత పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్, అక్కమాదేవి, సుమన్, శ్రీధర్, పీఈటీ రామ్ వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్, ఎంపీటీసీ శ్రీను, సామాజిక కార్యకర్త వెంకటయ్యలు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



మురుగు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పరిగి: పట్టణంలో సమస్యలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని 5వ వార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగు నీరు రోడ్లపై ఏరులై పారుతుందన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు నిత్యం రోగాల బారిన పడుతున్నారన్నారు. పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పరిసరాలు శుభ్రం లేకపోవడం విడ్డూరమన్నారు. మురుగు నీరు నిల్వతో ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కూడా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. కానరాని సూచికలు



మలుపులతో ఉన్న బిచ్చాల రోడ్డు



తిమ్మారెడ్డిపల్లి వద్ద ప్రమాదకరంగా మలుపు

- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: మలుపుల రహదారులతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని గ్రామీణ రోడ్లు మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా మారాయి. గ్రామాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు బీటీ రోడ్లను ప్రభుత్వం నిర్మిస్తుంది. కానీ మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయలేదు. రాత్రి పూట ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు సందర్భాల్లో మృత్యువాత పడిన ఘటనలున్నాయి.

ప్రమాదాలకు నిలయాలు

సాధారణంగా రోడ్డుకు మూలమలుపు ఉండడం సహజం. మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లకు మలుపులు దర్శనమిస్తుంటాయి. కాగా కొన్ని గ్రామాల్లో మూలమలుపుల పరిస్థితి మరీ దారుణంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గైడ్‌వాల్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మలుపులు ఇవే..

- మండలంలోని గోకఫసల్‌వాద్ నుంచి తిమ్మారెడ్డిపల్లి మీదుగా బాలంపేట వరకు రోడ్డంతా మలుపులు ఉన్నాయి.
- కుదురుమళ్ల బీటీ రోడ్డు నుంచి హస్నాబాద్ వరకు 3 కి.మీ వరకు మూలమలుపులున్నాయి.
- దౌల్తాబాద్ నుంచి కోన్గి వరకు 18 కి.మీ మలుపులతో కూడిన రోడ్డు ఉంది.
- దేవర్‌ఫసల్‌వాద్ నుంచి సుల్తాన్‌పూర్ వరకు మలుపులు ఎక్కువగా ఉన్నాయి.